# అర్పణ

ఇందుకూరి సత్యనారాయణరాజుగారు

అదియుద్ధసమయం. పగలుకూడా వీథుల్లో జనప్రచారంలేదు. తలుపులు బిడాయించుకొని యిళ్లల్లోకూర్చుండేవారు ప్రజలు. ఊరంతా కళకాంతులులేక వెలవెలబోతూ వుంది. ఎప్పుడు శత్రువులు మీదవచ్చిపడతారో అనేభయమే ప్రతీవాళ్లకీ. ఏడ్చేపిల్లల్ని "యిదిగో పటాలంవస్తోంది. నోరుమూయ్" అని ఝడిపించేవాళ్లు తల్లులు.

రాత్రి సుమారు పదిగంటలవుతుంది. తలుపు ఘడియవేసుకొని లోపల చిట్టిని ఉయ్యాల్లోపండుకోపెట్టి జోలపాటలు నెమ్మదిగా పాడుతూ ఊపుతోంది నరసమ్మ. చిన్నమరది కాబోలు మడతమంచంమీద హాయిగా నిద్రపోతున్నాడు. హఠాత్తుగా వీథిలో తలుపుకొట్టిన చప్పుడు అయింది. పాపం ఆమె ఉలిక్కిపడింది. "ఎవరు చెప్మా యిట్లాంటి వేళ తలుపుకొట్టింది" అని అనుకొంది. మళ్లీ చప్పుడు అధికమయింది. "తలుపుతీయకపోతే బద్దలు కొట్టుకొని ప్రవేశిస్తాము" అనేమాటలు గంభీరంగా వినిపించేయి. తత్తరపాటుతో పరుగెత్తుకువెళ్లి తలుపుతీసింది. తలుపుతీయంగానే పటాలం గబగబా లోపలకు ప్రవేశించింది. వాళ్లను చూడడంతోటే ఆమెకు గుండెలు ఝల్లుమన్నాయి. నోట్లోంచి మాటరాలేదు. నిశ్చేష్టితురాలైంది. అసహాయ. ఏంచేస్తుంది పాపం? యింట్లో మగవాళ్లులేరు. భర్త పటాలంలోజేరి స్వాతంత్రసమరంలోకి పోయాడు. అయినా ధైర్యం చిక్కబట్టి అట్లాగే నిలబడిపోయింది. "దాహం" అని అరచేరు. తుందుడుకు చెందిన హృదయాన్ని గట్టిపరుచుకుంటూ, కంగారుగా, వంటయింట్లోకి జొరబడి మంచినీళ్లుతెచ్చి కంపిస్తూఉన్న కరాలతో అందిచ్చింది పానీయం వాళ్లకు. "రెండుగంటల క్రిందట మీపటాలం యిలా వెళ్లిందట. యెచ్చటికి పోయిందో చెప్ప గలవా?" అని ప్రశ్నించేరు సేనాని ఆమెను.

తెల్లబోయిందామె అమాటలు వినడంతోటె. కత్తివేటుకన్నా నెత్తురు చుక్కలేదు మొహంలో. ఆవిడకు తెలుసుసైన్యం యెట్లావెళ్లిందో. తనప్రియుడూ, యింకా దేశ స్వాతంత్ర్యంకోసం ప్రాణాలని సమర్పించటానికి ఉద్యుక్తులైన యువకులూ ఉన్నారు ఆపటాలంలో. వారు యేమార్గంగుండా వెళ్లారోచెప్తే వీళ్లువాళ్లమీదపడి కొట్టబోయే

స్వాతంత్ర్యసాధాన్ని కూలదోస్తారనీ ఆమె తెలుసుకొంది. "నాలాంటివాళ్లనా అడగటం మా సైన్యాన్నిగూర్చి?" అని అంది మెట్టకేలకు.

"అవును. నీకు తెలుసును కాబట్టి అడుగుతున్నాము."

"మావాళ్లకు హానికలిగించేవిషయం మీకెట్లా చెప్తాననుకొన్నారు." అంది నరసమ్మ జంకూకొంకూ లేకుండా.

"అలాగా! నీచేత బలవంతంగానైన చెప్పిస్తాచూడు." అని దబాయించేడు సేనాని.

"నేను అబలను. అబలలతో ఢీకొనే వీరులా మీరు?"

కొంచెం కోపంవచ్చింది సేనానికి—

"చెప్తావా? చెప్పవా? నీ అవస్థయేమవుతుందో ఊహించుకో! ఖాన్! గురిచూడు. అబద్ధం వచించేవంటే నిన్ను పేల్చేస్తాము."

భయకంపిత అయింది ఆమె. మెరపువలె ఆలోచనలు మానసికాంబరాన మెరసిపోయాయి. తాను ద్రోహంచేస్తే దేశపుస్థితి తలపోసింది. తన నాథునిసంగతి, స్వాతంత్ర్యానికై తమ రక్తంతో దేశమాత పాదప్రక్షాళన చేయటానికి ఉంకించుకొన్న యితర యువకుల సంగతి జ్ఞాపకంవచ్చింది ఆమెకు. ప్రాణము బుద్బుదప్రాయమని ఆమె చింతించింది. నిమీలితనేత్రయై కొంచెంసేపు అక్కడ, అట్లే నిలబడిపోయింది. కొంతసేపటికి ఆవేశపూరితయై కనులువిప్పింది.

"తుపాకులు బారుపెట్టి ఉన్నాయి. నేను మళ్లీ ఆజ్ఞాపిస్తున్నా? నిజంచెప్పు."

జవాబులేదు.

"ఆఖరుసారి; మాట్లాడు?"

నిశ్శబ్దం.

అట్లా ఆమె కొయ్యలా నిలబడిపోయింది.

"ఢా" మ్మని శబ్దించింది......

భూదేవి ఆనందపారవశ్యంతో సాధ్వి, వీరవనిత, త్యాగస్వరూపిణి అయిన ఆమె భౌతికదేహాన్ని కౌగలించుకొంది.